# పేషెంట్ చెప్పే కథలు

## పరుగం

"గుడ్ మార్నింగ్ యంగ్ లేడీ!"

"గుడ్ మార్నింగ్! నేనింకా యంగ్ లేడీలా కనిపిస్తున్నానా మీకు?" స్నిగ్ధంగా నవ్వింది డాక్టర్ శ్రుతి.

"మీరెంత పెద్దవాళ్ళయినా నువ్వూ, హరితా నాకు చిన్నపిల్లల్లానే కనిపిస్తారమ్మా!" పండిపోయిన జుట్టు, అలిసిపోయిన కళ్ళు, ఆర్ద్రంగావున్న కంఠం.... శ్రీపతిరావును చూస్తుంటే ఆయన రూపురేఖల్ని పుణికి పుచ్చుకున్న తన స్నేహితురాలు హరిత కళ్ళముందు నిలిచింది శృతికి.

"హరిత ఫోన్ చేసింది. రిజర్వేషన్ దొరకలేదట. హైద్రాబాద్ వరకు ఫ్లైట్‌లో వచ్చి అక్కడనుండి ఎలాగోలా రేపు ఉదయానికి ఇక్కడకు చేరుకుంటానని చెప్పింది. మీకు వచ్చింది మైల్డ్ స్ట్రోకేనంటే నమ్మదే. బాగా కోలుకుంటున్నారు. ఫిజీషియన్ ప్రమాదమేమీలేదని చెప్పారని చెప్పాను. అయినా రెక్కలు కట్టుకుని మీ ముందు వాలాలని దాని ఆత్రుత."

"నిజమేనమ్మా! నాకూ అలాగేవుంది. ఎప్పుడు వస్తుందా అని వెయ్యికళ్ళతో ఎదురుచూస్తున్నాను." శ్రీపతిరావు కళ్ళు చెమ్మగిల్లాయి.

అవును, యిన్నాళ్ళకు తను మనుషుల కోసం, ఆత్మీయుల కోసం, ప్రేమకోసం, చల్లటి పలకరింపుకోసం మొహం వాచి నట్లెదురు చూస్తున్నాడు.

"హరనాధ్‌గారు, హృషీకేశ్ గారు, హసితగారు ఎక్కడున్నారు? వాళ్ళ ఫోన్ నంబర్స్ యివ్వండి. ఫోన్ చేస్తాను."

శ్రీపతిరావు కళ్ళల్లో మేఘాలు కమ్ముకున్నాయి.

"ఎందుకమ్మా ఫోన్ చెయ్యడం?! వాళ్ళెలాగూరారు. ఒకడు అమెరికాలో, ఒకడు జపాన్‌లో, హసిత జర్మనీలో వున్నారు. ముగ్గురూ ఆ దేశాలవాళ్ళనే పెళ్ళి చేసుకుని తరువాతెప్పుడో ఒక ఉత్తరం ముక్క రాసిపడేశారు....హరిత ఒక్కతే నా మనసు గ్రహించి నేను కుదిర్చిన సంబంధం చేసుకుని ఇండియాలో వుండిపోయింది. అది కూడా నామాట వినకుండా ఏ శ్రీలంక వాడ్నో చేసుకునివుంటే ప్రపంచంలో నాలుగు దిక్కుల్నీ కలిపిన బిడ్డల్ని కన్న ఖ్యాతి దక్కేది నాకు" నవ్వాడాయన. ఆ నవ్వు వెనుక దాగివున్న విషాదాన్ని శృతి పసిగట్టింది. ఆయన్ని కదిపి, అంతగా మాట్లాడేలా చేసినందుకు కించపడింది.

"మీరీ జ్యూస్‌తాగి రెస్ట్ తీసుకోండి. పేషెంట్స్‌ని చూచి మళ్ళీ వస్తాను." ఆప్యాయంగా పళ్ళరసం తాగిస్తున్న శ్రుతిని చూస్తుంటే శ్రీపతిరావు కళ్ళల్లో నీళ్ళు సుళ్ళు తిరిగి గడిచిపోయిన జీవితం, మరుగు పడిపోయిన జ్ఞాపకాలు వెలికివచ్చాయి.

నిరుపేద కుటుంబంలో పుట్టిన తనకు ఊహ తెలిసిన దగ్గర్నుండి డబ్బు లేకపోవడంలోని లోటు, డబ్బులేనినాడు తప్పనిసరిగా దిగమింగాల్సిన అవమానాలు, ఆశాభంగాలు అనుక్షణం అనుభవంలోకి వచ్చాయి. అష్టకష్టాలుపడి, అన్నిటికీ తలవంచి చదువులో నెగ్గుకువచ్చి ఇంజనీరయాడు. ఉద్యోగంలో చేరిన రోజున తన ముందున్న ఏకైక లక్ష్యం డబ్బు సంపాదించడం. తను కోరిన డబ్బు, తనను అవమానించినవారిని పరిహసించగల స్థాయి తన ఉద్యోగంలో సంపాదించలేనని కొద్ది రోజుల్లోనే తెలిసొచ్చింది.



ఆలోచించి, ఆలోచించి చివరకు తెగించి ఉద్యోగం మానేసి కాంట్రాక్ట్సు చెయ్యడం ప్రారంభించాడు. అప్పటినుండి యిప్పటివరకు బ్రతుకంతా వొకటేపరుగు. ఇంకా యింకా పై శిఖరాలకు చేరుకోవడానికి నిర్విరామమైన కృషి. ఒకసారి పరుగుపందెంలో పాల్గొవడం మొదలుపెట్టాక వెనుకపడి పోకూడదనే పట్టుదల. పరుగు, పరుగు, నిరంతరం పరుగు పెడుతూనే వున్నాడు. ఈ పోటీ నిషాలో పూర్తిగా కూరుకుపోయి బ్రతుకులో ఎన్నో మధురమైన అనుభూతుల్ని కోల్పోయానని, ఎన్నో విలువైన వాటిని చేజార్చుకున్నానని చాలా ఆలస్యంగా గుర్తించాడు. అప్పటికే తను డబ్బుకు దగ్గరగా మనుషులకు దూరంగా జరిగిపోయాడు. తను సంపాదించిన డబ్బు తన పిల్లల్ని ఉన్నతస్థాయిలోకి తీసుకొచ్చింది కాని వాళ్ళకూ తనకూ మధ్య దాటలేని అగాధాన్ని సృష్టించింది.

బ్రతుకులో తనేం కోల్పోయాడో తెలుసుకునేసరికి హరిత ఒక్కతే తన దగ్గర వుంది. ప్రయత్నపూర్వకంగా తను పూడ్చుకుంటూ వచ్చిన అగాధాన్ని హరిత సులభంగా దాటి వచ్చేసింది. పరుగువేగాన్ని తగ్గించి హరితతోనూ, తన భార్యతోనూ తీరికగా కొన్ని సంతోష సమయాల్ని పంచుకుంటూన్నప్పుడు హరిత స్నేహితురాలు శ్రుతికూడా అప్పుడప్పుడూ తమతోచేరేది... ఆయన కళ్ళలోని తడిని గమనించి వెంటనే వెళ్ళిపోవడానికి మనసొప్పక అలాగే నిలబడిపోయింది శ్రుతి.

"నీకు చాలా శ్రమనిస్తున్నానమ్మా!" తెప్పరిల్లి శ్రుతివంక బాధపడుతున్నట్లుగా చూచాడు శ్రీపతిరావు.

"మీరలా అంటే నాకు చాలా బాధ కలుగుతుంది. మీరు హరికెంత ప్రియమైన వ్యక్తో నాకూ అంతే. ఆ కాంట్రాక్టు పుణ్యమా అని పనిమీద మీరీ ఊరొచ్చారు. సడెన్‌గా గుండెనొప్పివచ్చి అనుకోకుండా ఇక్కడకు వచ్చారు కాబట్టి యిన్నేళ్ళకు మిమ్మల్ని చూడగలిగాను....మీరు మరిచిపోయినా, ఒక పేదపిల్లకు మీ కూతురితో పాటు ఆప్యాయతను పంచిన మీ ఔదార్యాన్ని నేను మరిచిపోలేను" ఎమోషన్‌తో చలించింది శ్రుతిస్వరం. ఎప్పుడో నిస్వార్థంగా తను పంచిన రవ్వంత ప్రేమకు ప్రతిగా ఎంత ఆప్యాయతనూ ప్రేమనూ పొందుతున్నాడు తను! ....సన్నజాజి పరిమళంలా సంతోషం అలముకుంది శ్రీపతిరావు గుండెల్నిండా.

డాక్టర్ ఆలూరి విజయలక్ష్మి